రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మకర రాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణం పుణ్యకాలమని తెలిపారు. ప్రజల జీవితాల్లో ఈ పండుగ సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు సిరి సంపదలతో తులతూగాలన్నారు. భోగభాగ్యాల సంక్రాంతి పండుగ అందరి ఇంట కలల పంట పండించాలన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

కేటీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా తెలుగు ప్రజలందరికీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా భోగభాగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని శనివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగలను జరుపుకోవాలని అభిలషించారు. ఈ పండగ సందర్భంగా పతంగులు ఎగరేసే ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ సూచించారు.

సంక్రాంతి వరుస

సంక్రాంతి పండుగకు నగర వాసులు పల్లెబాట పట్టడంతో హైదరాబాద్ - విజయవాడ హైవేపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా నుంచి విజయవాడ వరకు 65వ జాతీయ రహదారి పొడవునా వాహనాలు వరుస కట్టాయి. దీంతో రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పంతంగి టోల్‌గేట్ నుంచి 65 వేల వాహనాలు వెళ్లినట్టు జీఎంఆర్ అధికారులు తెలిపారు.

- చౌటుప్పల్

ఎక్స్‌టెన్షన్లు రద్దుచేయండి

- మంత్రి ఉత్తమ్‌కు ఇంజినీర్ల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి13 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ఎక్స్‌టెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, వివిధ హోదాల్లో కొనసాగుతున్న అధికారులను వెంటనే తొలగించాలని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు విజ్ఞప్తి చేశారు. జలసౌధకు వచ్చిన మంత్రికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్‌శాఖలో వివిధ క్యాడర్లలో పలువురు ఇంజినీర్లు ఎక్స్‌టెన్షన్‌పై పనిచేస్తున్నారని తద్వారా ప్రమోషన్లకు అవకాశం లేకుండా పోతున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

సిద్దిపేట కోమటి చెరువు వద్ద పతంగి ఎగురవేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆటోడ్రైవర్లకు జీవనభృతి ఇవ్వాల్సిందే

- వారి సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒకరికి మంచి చేయబోయి ఇంకొకరి ఉసురు పోసుకోవడం తగదు: హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 13: ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, నెలకు రూ.15 వేల చొప్పున జీవనభృతి ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, రాష్ట్రంలోని 6 లక్షల మంది ఆటోడ్రైవర్లను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తప్పుపట్టడం లేదని, ఒకరికి మంచి చేయడానికి ఇంకొకరి కడుపు కొట్టొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. ఆటో కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో 1,480 మంది ఆటోడ్రైవర్లు సభ్యులుగా ఉన్నారని, వారే సిద్దిపేటకు బ్రాండ్ అంబాసిడర్లు అని వెల్లడించారు. ఆటోడ్రైవర్లు నిత్యం బిజీగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టరని, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం ఆటలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కోమటి చెరువుపై కైట్ ఫెస్టివల్ ప్రారంభం

పతంగుల పండుగ అంటేనే ఆనందం, ఆహ్లాదం అని, పతంగులకు దారం ఆధారం అయితే పిల్లలకు తల్లిదండ్రులు ఆధారమని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కోమటిచెరువు వద్ద కైట్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించి, ప్రజలతో కలిసి పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గులాబీ తరంగం

- ఓటమి పాఠం నుంచి గెలుపు శపథం
- పార్టీ శ్రేణుల్లో సడలని ఆత్మవిశ్వాసం
- కార్యకర్తతో నాయకత్వ కరచాలనం
- తెలంగాణ భవన్ కేంద్రంగా కార్యాచరణ
- కొత్త సన్నాహకానికి ఊపిరిలూదుతున్న సమావేశాలు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్ర సాధనకోసం సాగిన భావసంఘర్షణకు నాడు వేదికగా నిలిచిన తెలంగాణ భవన్ పదిరోజులుగా కొత్త సన్నాహానికి ఊపిరిలూదుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి గల కారణాలను సమీక్షించుకొంటున్నది. జరిగిన పొరపాట్లను, సమన్వయలోపాన్ని గుర్తిస్తున్నది. భవిష్యత్తు కార్యాచరణకు మార్గనిర్దేశనం చేస్తున్నది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయిదాకా పార్టీ సంస్థాగత నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలను గుర్తిస్తున్నది. అన్నిటికన్నా మిన్నగా బీఆర్ఎస్ పార్టీ అన్నా, అధినాయకుడు కేసీఆర్ అన్నా తమకెంత అభిమానమో, అనుబంధమో కార్యకర్తలు ఒక్కొరొక్కరుగా అనుభవాలను వెల్లడిచేసే వేదికగా తెలంగాణ భవన్ మారింది. ఈ నెల 3 నుంచి రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. కార్యకర్తలతో బీఆర్ఎస్ నాయకత్వం కరచాలనం చేస్తున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికిగల కారణాలను లోతుగా విశ్లేషిస్తున్నది. బీఆర్ఎస్ 10 ఏండ్లు అధికారంలో ఉండటం వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, నాయకత్వానికి మధ్య లింకు తెగిపోయిందని, దాన్ని తిరిగి జతచేయాల్సిన అవసరం ఉందని సమావేశాలు నిరూపిస్తున్నాయి.

ఆహ్వానితుల కన్నా అధికంగా

సాధారణంగా ఎన్నికల ఫలితాల తరువాత ఓడిపోయిన పార్టీలు సమావేశాలు నిర్వహించటానికి వెనుకడుగు వేస్తాయి. పిలిచినవారు వస్తారో రారో? అని అనుమానపడతాయి. ఇందుకు బీఆర్ఎస్ పార్టీ భిన్నం అని తెలంగాణ భవన్‌లో సమావేశాలు నిరూపిస్తున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలుండగా, రోజుకో నియోజకర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నది. ఎంపీ, ఎమ్మెల్యేలు, పోటీచేసిన అభ్యర్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు ఇలా.. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం 60 నుంచి 70 మందితో మొత్తం 450 నుంచి 500 మందివరకు నాయకులు హాజరవుతారని భావించింది. అయితే అనూహ్యంగా ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1000 మందికిపైగా హాజరవుతున్నారు. తెలంగాణ భవన్‌లోని సమావేశ మందిరం కాలుపెట్ట సందులేకుండా కిక్కిరిసిపోతున్నది. అన్ని సమావేశాల్లోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి.

తేదీ	నియోజకవర్గ సమావేశం
17	నాగర్-కర్నూల్
18	మహబూబ్‌నగర్
19	మెదక్
20	మల్కాజ్‌గిరి
21	సికింద్రాబాద్, హైదరాబాద్
22	నల్లగొండ

ఖుల్లం ఖుల్లా...

ఇప్పటి వరకు జరిగిన 10 నియోజకవర్గాల సమావేశాల్లో నేతలు మొహమాటం లేకుండా అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. 'కాంగ్రెస్ తన సొంతబలంతో గెలవలేదని, బీఆర్ఎస్‌లోని నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న బలహీనతల వల్లే గెలిచింది' అని అందరూ అంగీకరిస్తున్నారు. ఉద్యమకారులకు, పార్టీ ఆవిర్భావం నుంచి గులాబీ జెండా మోసిన కార్యకర్తలకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు మధ్య సమన్వయంలేకపోవడం, చాలామంది ఎమ్మెల్యేలు, అభ్యర్థులు సరైన సమయంలో సమన్వయం చేయకపోగా ఇంకా అంతరాన్ని పెంచే చర్యలు తీసుకున్న చోట పార్టీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సహా ఇతర నేతలు సమావేశాన్ని ప్రారంభించే ముందే సన్నాహక సమావేశం నిర్వహణ నేపథ్యాన్ని చెప్తున్నారు. రెండు విడుతలుగా జరిగే సమావేశం ముందుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర ఒక్కరిద్దరు నేతలు, ఆ పార్లమెంట్ పరిధిలోని నాయకులకు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత నియోజకవర్గాల వారీగా కార్యకర్తలకు అవకాశం కల్పించటం, నేరుగా చెప్పటానికి ముందుకురాని వారు పేపర్ మీద వారి అభిప్రాయాన్ని రాసి పంపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏకవ్యక్తి కేంద్రంగా సాగుతుందని, కార్యకర్తలు, నాయకులకు మాట్లాడే అవకాశం ఎంతమాత్రం లేదని చేసేవి కేవలం ఆరోపణలేనని సమావేశాలు తేల్చిచెప్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తాము ఆశించినస్థాయిలో రాకపోయినా కుంగిపోకుండా ఓటమి పాఠం నుంచి సరికొత్త గెలుపుదారుల్లో పయనిస్తామని గులాబీ శ్రేణులు ప్రతినబూనుతున్నాయి. ఇప్పటివరకు ఆదిలాబాద్, కరీంనగర్, చేవెళ్ల, పెద్దపల్లి, జహీరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్ల సమావేశాలు పూర్తయ్యాయి. సంక్రాంతి పండుగ తరువాత తిరిగి 17వ తేదీన నాగర్‌కర్నూల్ నియోజకర్గ సన్నాహక సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

అభ్యర్థిత్వాల కోసం అభ్యర్థనల వెల్లువ

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకులు, వివిధ సామాజికవర్గాలకు చెందిన నేతలు, ఉద్యమకారులు, మేధావులు, యూనివర్సిటీ అధ్యాపకులు (ఉస్మానియా, కాకతీ సహా పలు యూనివర్సిటీల), సామాజికవేత్తలు కేటీఆర్, హరీశ్‌రావు తమతమ బయోడేటాలను అందజేస్తున్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పార్టీ అధినాయకత్వంతో తమ అభ్యర్థిత్వాలపై చర్చించి అవకాశం కల్పించే విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తుండటం విశేషం.

ప్రాజెక్టుల పనులకు రూ. 23వేల కోట్లు

- వడ్డీలు, అసలుకు రూ.22వేల కోట్లు
- రూ.45వేల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి13 (నమస్తే తెలంగాణ): కీలక సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కోట్లు, ఇప్పటికే తీసుకున్న రుణాలు, అసలు చెల్లింపుల కు మరో 22వేల కోట్లు, మొత్తంగా రూ.45 వేల కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కొత్తగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, సీతారామ, చిన్నకాళేశ్వరం, ఇందిరమ్మ వరద కాలువ పథకాలను తొలి ప్రాధాన్యంగా తీసుకునేందుకు సమాలోచనలు చేస్తున్నది. ప్రస్తు తం మొత్తంగా 13,935 కోట్ల బిల్లులు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెం డింగ్‌లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 10 వేల కోట్లు వెచ్చిస్తే 45 లక్ష ఎకరాలు కొత్తగా సాగులోకి వస్తుందని ప్రభుత్వం గుర్తించింది.

ఓబీసీ కులగణన చేపట్టాలి

- రాహుల్‌గాంధీకి బీసీ సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జనగణలో భాగంగా ఓబీసీ కులగణ చేపట్టాలని 29 రాష్ట్రాలకు చెందిన ఓబీసీ సంఘాల ప్రతినిధులు కోరారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, అఖిలభారత బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలో వారంతా ఢిల్లీలో రాహుల్‌గాంధీని శనివారం ప్రత్యేకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సం ఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పదేండ్లుగా ఓబీసీ కులగణన నిర్వహించకుండా కేంద్రంలోని బీజేపీ సర్కారు బీసీలను నిర్లక్ష్యం చేసిందని, ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయకుండా, బీసీ రిజర్వేషన్లు, క్రీమిలేయర్ పరిమితి పెంచకుండా అన్యాయానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాహుల్ చేపట్టబోయే భారత్ జోడో న్యాయయాత్రకు మద్దతుగా నిలబడతామని తెలిపారు. రాహుల్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ చంద్రశేఖర్, బెల్లయ్యనాయక్, గొమాస శ్రీనివాస్, డాక్టర్ రవి, జనగాం రవీందర్‌గౌడ్‌తో పాటు 29 రాష్ట్రాల ప్రతినిధులున్నారు.

'స్థానిక' రిజర్వేషన్ మారేనా?

- కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ దఫా మార్పులుండవు
- నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటుతో అస్పష్టత
- చట్ట సవరణతోనే మార్పులకు అవకాశం
- ఆసక్తికరంగా మారిన రిజర్వేషన్లు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగుస్తుండటంతో రిజర్వేషన్లపై ఆసక్తి నెలకొన్నది. తెలంగాణలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చాక ఒకసారి అమలు చేసిన రిజర్వేషన్లను రెండుసార్లు కొనసాగించాలని చట్టంలో పొందుపర్చారు. ఈ చట్టం వచ్చాక రాష్ట్రంలో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్త వాటికి రిజర్వేషన్ ఎలా అమలు చేస్తారనే దానిపై చర్చ మొదలైంది. చట్టంలో ఒకే రిజర్వేషన్‌ను రెండు టర్మ్‌లు అమలు చేయాలని ఉండటంతో కొత్త స్థానిక సంస్థల సంగతేమిటి? బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు? మొత్తంగా స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఎలా ఉంటాయి? అనే అంశాలపై రాజకీయ నాయకుల్లో జోరుగా చర్చ సాగుతున్నది. కొత్త స్థానిక సంస్థలకు కొత్త రిజర్వేషన్లు అమలు చేస్తే అప్పటికే ఆ మండలం, ఆ జిల్లాలో ఉన్న రిజర్వేషన్ల శాతంలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో వాటిని ఎలా సరిచేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, ఈ రిజర్వేషన్లపై నిపుణులు, అధికారులు మాత్రం భిన్న వాదనలు వినిపిస్తున్నారు. ఇప్పటికే ఉన్నవాటికి రిజర్వేషన్లు మారవని, పంచాయతీరాజ్ చట్టంలో రెండుసార్లు రిజర్వేషన్ అమలు చేస్తామని ఉన్నందున కొత్త వాటిని యూనిట్‌గా తీసుకొని జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించే అవకాశం ఉంటుందని ఓ అధికారి తెలిపారు. బీసీలకు అమలు చేసే రిజర్వేషన్ శాతం, కొత్త స్థానిక సంస్థల రిజర్వేషన్లన్నింటిపై న్యాయసలహా తీసుకొని ముందుకెళ్లాల్సి ఉంటుందని మరో అధికారి.. వీటన్నంటిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయం అవుతుందని ఇంకో అధికారి చెప్పారు. ప్రభుత్వానికి ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అధికారం ఉన్నదని, దానికి అనుగుణంగా చట్టసవరణ చేస్తే సరిపోతుందని, ఇందులో ప్రభుత్వం రాజకీయంగా తీసుకునే నిర్ణయమే అన్ని సందేహాలు, అనుమానాలకు సమాధానం అవుతుందని స్పష్టం చేస్తున్నారు. చట్టాలను సవరించే అధికారం, వెసులుబాటు ఏ ప్రభుత్వానికైనా ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయంపై ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రంలో బీసీల జనాభాను లెక్కించి వారికి స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ అమలు చేస్తామని అధికార కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ, మొత్తం రిజర్వేషన్లు 50% మించరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన హామీని ఏవిధంగా అమలు చేస్తుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

బీసీ రిజర్వేషన్లపై కసరత్తు

స్థానిక సంస్థల్లో బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్ కల్పించాలన్న దానిపై రాష్ట్రంలో కసరత్తు మొదలైంది. ఈ రిజర్వేషన్లు కల్పించాలంటే బీసీల లెక్కలను శాస్త్రీయంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతం మించరాదని పేర్కొన్నది. ఎవరికి ఎంత శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారు? అందుకు ప్రాతిపదిక ఏమిటి? అనే వివరాలను సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడంతో ఆ బాధ్యతలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీంతో ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటించిన తెలంగాణ బీసీ కమిషన్.. ఆయా రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల్లో బీసీలకు ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించారు, ఆ ప్రక్రియను ఏ విధంగా పూర్తి చేశారనే దానిపై అధ్యయనం చేసింది. అనంతరం రాష్ట్రంలో లెక్కలు తీయడంలో నిమగ్నమైన బీసీ కమిషన్.. 2006, 2014, 2019 ఎన్నికల్లో స్థానిక సంస్థలకు ఎవరెవరు, ఏ కులాలు, ఉప కులాల వారు ప్రాతినిధ్యం వహించారన్న వివరాలను తెలియజేయాలని పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించింది. దీంతో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ వైస్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్ల వివరాలతోపాటు వారి కులాలు, ఉప కులాలు, విద్యార్హతలు, వృత్తి, ఎన్నికల నాటికి వారి వయస్సు, వారు ప్రాతినిధ్యం వహించిన సంవత్సరం తదితర వివరాలను పంపించాలని పంచాయతీరాజ్ డైరెక్టర్ హన్మంతరావు అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు, జిల్లా పరిషత్ సీఈవోలకు స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో సమగ్ర 'శిక్ష'

- ఎస్ఎస్ఏకు ఈ సారి పాత బడ్జెట్టే
- కొత్తవి వద్దంటూ మెలికపెట్టిన కేంద్రం
- ఈసారి 1,900 కోట్లకే ప్రతిపాదన

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కొత్తవాటిపై కోటి ఆశలు పెట్టుకున్న వారిపై కేంద్రం అప్పడే నీళ్లుచల్లింది. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ (ఎస్ఎస్ఏ) బడ్జెట్‌ను పెంచబోమని ముందే చేతులెత్తేసింది. ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కొత్త ప్రతిపాదనలు చేర్చకండి.. తామైతే ఇవ్వలేమని తేల్చేసింది. ఫలితంగా పాఠశాల విద్యలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టే ఈ ప్రాజెక్ట్‌కు నిధుల సమస్య తలెత్తింది. 2024-25 విద్యాసంవత్సరానికి ఎస్ఎస్ఏ బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని కేంద్రం ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖకు సూచించింది. రాష్ట్ర అధికారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే ఈ సారికి పాత బడ్జెట్ ప్రతిపాదనలే సమర్పించాలని, కొత్త ప్రతిపాదనలొద్దని కేంద్రం మెలికపెట్టింది. దీంతో ఈ ఏడాది రూ.1,900 కోట్లకే అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. గతంలో ఈ ప్రాజెక్ట్‌లో ఏటా 20 శాతం పెంచుకునేందుకు అవకాశం ఉండేది. కానీ కేంద్రం ఈ అవకాశం లేకుండా చేసింది.

జీతాలు.. డైట్ చార్జీలకే

సమగ్రశిక్ష ప్రాజెక్ట్ నిధులు సిబ్బంది జీతాలు, డైట్‌చార్జీలకే అన్నట్టు తయారైంది. ప్రతి నెల కేజీబీవీ, సమగ్రశిక్ష సిబ్బందికి వేతనాల చెల్లింపునకు రూ.35 కోట్లు, కేజీబీవీ డైట్ చార్జీలుగా రూ.20 కోట్ల అవసరం అవుతున్నాయి. వీటి చెల్లింపులకే విద్యాశాఖ ఆపసోపాలు పడుతున్నది. ఇదిలా ఉండగా రాష్ట్ర వాటా నిధులను ఇస్తేనే తామూ ఇస్తామని కేంద్రం మెలికపెడుతున్నది. గతంలో ఇలాంటి సంప్రదాయం ఉండేది కాదు. కేంద్రం తన వాటాను తప్పనిసరిగా ఇచ్చేది. గతంలో రాష్ట్ర వాటాతో నిమిత్తం లేకుండా ఆమోదిత బడ్జెట్‌లో 75 శాతం నిధులను కేంద్రం విడుదల చేసేది. కొంత కాలానికి మిగిలిన 25 శాతం నిధులిచ్చేది. తర్వాత దీన్ని 50:50కి మార్చింది. గత ఏడాది కేంద్ర వాటా నిధులను నాలుగు విడతలుగా విభజించింది. తొలుత మొదటి విడత నిధులను విడుదల చేస్తున్న కేంద్రం.. రాష్ట్రం తన వాటా విడుదల చేశాకే రెండో విడతను విడుదల చేస్తున్నది. దీంతో గత ఏడాది రూ.1,913 కోట్లకు ఆమోదం లభిస్తే రూ.1,500కోట్లకు పైగా నిధులు అందని పరిస్థితి నెలకొన్నది. 20 శాతం నిధులు పెంచుకొనే అవకాశం లేకపోవటంతో ఏడేండ్లుగా ఎస్ఎస్ఏ ఆమోదిత బడ్జెట్ తగ్గుతూ వస్తున్నది.

ఏడేండ్లల్లో ఎస్ఎస్ఏ నిధులు వివరాలు (కోట్లల్లో)

సంవత్సరం	ఆమోదించిన బడ్జెట్
2017-18	2,196.35
2018-19	2,285.32
2019-20	2,631.62
2020-21	2,285.54
2021-22	2,142.49
2022-23	1,813.60
2023-24	1.913.93

ఆకట్టుకున్న తెప్పల పోటీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం రుద్రవరం శివారులోని మిడ్‌మానేరు జలాశయంలో తెప్పల పోటీలు అలరించాయి. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పోటీలు నిర్వహించగా, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంకాంత్రి సెలవులు కావడంతో పోటీలను చూసేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 12 మంది చొప్పున జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.

- వేములవాడ రూరల్

నిశ్శబ్ద సూపర్‌సానిక్ విమానం సాధ్యమే!

వాషింగ్టన్: వాణిజ్యపరమైన సూపర్‌సానిక్ విమానాలు సాధ్యమేనని రుజువు చేయడానికి నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్), లాక్‌హీడ్ మార్టిన్ స్కంక్ వర్క్స్ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఎక్స్-59 క్వైట్ సూపర్‌సానిక్ ఎయిర్‌క్రాఫ్ట్ గురించి నాసా అధికారికంగా శుక్రవారం వెల్లడించింది. ఇది శబ్ద వేగాన్ని మించిన వేగంతో ప్రయాణిస్తుందని, అంతేకాకుండా, దీని నుంచి శబ్దం వెలువడదని తెలిపింది. ఈ ప్రయోగాత్మక విమానం డేటాను సేకరిస్తుందని తెలిపింది. దీనిని త్వరలోనే ప్రారంభించి, ఆ తర్వాత మొదటి నిశబ్ద సూపర్‌సానిక్ విమాన ప్రయాణాన్ని ప్రారంభిస్తామని చెప్పింది. కాలిఫోర్నియాలోని లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ ప్రాంగణంలో ఈ విమానాన్ని ప్రదర్శించారు.

కోళ్ల లారీ బోల్తా.. ఎగబడ్డ జనం

మెదక్ జిల్లా రామాయంపేట శివారులో శనివారం వేకువజామున ఓ కోళ్ల లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దాదాపు సగం వరకు కోళ్లు చనిపోయాయి. అటుగా వెళ్లేవారు ప్రాణంతో ఉన్న కోళ్లను అందినకాడికి ఎత్తుకుపోయారు. ఈ ప్రమాదంతో వ్యాపారికి రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిసింది.

- రామాయంపేట

పటాన్‌చెరు సీఐ లాలూనాయక్ సస్పెన్షన్

పటాన్‌చెరు, జనవరి 13: విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ వ్యక్తి మరణానికి కారణమైన పటాన్‌చెరు సీఐ లాలూనాయక్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు ఎస్పీ రూపేశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత డిసెంబర్ 24వ తేదీ రాత్రి పటాన్‌చెరు సాకీ చెరువు వద్ద అమీన్‌పూర్‌కు చెందిన నాగేశ్వరరావుపై దాడి జరిగింది. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించి అతడి మృతికి కారణమైనట్టుగా విచారణలో తేలడంతో ఎస్పీ రూపేశ్ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. సీఐ లాలూనాయక్ స్థానంలో ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

పీజీ విద్యార్థి సస్పెన్షన్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

వరంగల్ చౌరస్తా, జనవరి 13: వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల అనస్థీషియా పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆత్మహత్య కేసులో యాంటీ ర్యాగింగ్ కమిటీ తీర్మానాన్ని హైకోర్టు రద్దు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేఎంసీ అనస్థీషియా ద్వితీయం సంవత్సరం విద్యార్థి సైఫ్ అలీ అభ్యర్థన మేరకు కోర్టు విడుదల చేసిన ఉత్తర్వులను అనుసరించి యాంటీ ర్యాగింగ్ కమిటీ పునఃవిచారణ జరిపింది. ఇందులో నిందితుడిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని నమ్మిన కమిటీ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ సస్పెన్షన్ సరైనదిగా మరో మారు తీర్మానించి కోర్టుకు అందజేసింది. కమిటీ తీర్మానంపై సైఫ్ హైకోర్టును ఆశ్రయించాడు. అతడి వాదనను సమర్థిస్తూ కోర్టు యాంటీ ర్యాగింగ్ కమిటీ తీర్మానాన్ని రద్దు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.